క్లుప్తంగా

డోలోత్సవానికి పటిష్ట బందోబస్తు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్సై మధుసూదనరావు

గార: శ్రీకూర్మనాథాలయంలో నిర్వహించే డోలోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై ఎం.మధుసూదనరావు తెలిపారు. శ్రీకాకుళం వన్‌టౌన్ స్టేషన్ సీఐ ఆధ్వర్యంలో వంద మంది పోలీసులు సోమవారం రాత్రి విధుల్లో పాల్గొన్నారు. కామదహనం, సముద్ర తీరంతో పాటు దేవాలయం వద్ద విధులు నిర్వహించారు.

ఉపాధ్యాయుడుకు సన్మానం



సుధాకర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

లావేరు: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ నడక పోటీల్లో రజత పతకం సాధించిన లావేరు హైస్కూల్‌లో ఇంగ్లిషు ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నళిని సుధాకర్‌ను సోమవారం విశాఖపట్నంలో సన్మానించారు. సుధాకర్ ఇటీవల శ్రీలంక దేశంలో జరిగిన పోటీల్లో రజత పతకంతో మెరిశారు. దీంతో అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు పొందిన ఈయన్ని విశాఖ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున సత్కరించి జ్ఞాపిక అందజేసి గౌరవించారు.

వీఆర్వోల మండల కమిటీ అధ్యక్షుడిగా చక్రవర్తి



చక్రవర్తి

గార: మండల వీఆర్వో కమిటీ అధ్యక్షుడిగా రామచంద్రాపురం గ్రామ రెవెన్యూ అధికారి చౌదరి వెంకట చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం ఎన్నిక జరిగింది. జనరల్ సెక్రటరీగా ఎడ్ల ఉమామహేశ్వరరావు. వైస్ ప్రెసిడెంట్‌గా టి.సుశీల, ట్రెజరర్‌గా గంగు ఢిల్లీశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మజ్జి మోహనరావు, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ ఉమామహేశ్వరావు ఎన్నికయ్యారు.

వైభవంగా నేతాలమ్మతల్లి యాత్ర



ప్రత్యేక అలంకరణంలో నేతాలమ్మ తల్లి

జి.సిగడాం: వాండ్రంకి గ్రామంలోని నేతాలమ్మ తల్లి 25వ యాత్ర మహోత్సవాలు రెండో రోజైన సోమవారం ఘనంగా జరిగాయి. మంగళవారంతో యాత్ర ముగిస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గంగమ్మ పేరంటాలకు పూజలు



బోనాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

జి.సిగడాం: పాలఖండ్యాం గ్రామంలో గంగమ్మ పేరంటాల రెండో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. స్థానికులతోపాటు టీడీవలస, మెట్టవలస, గేదెలపేట, మండాకురిటి, సంతవురిటి, నిద్దాం, మర్రివలస గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పంచాయతీ కేంద్రంలో ఆధార్ సేవలు



ఐరీష్ సేకరిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆధార్ సేవలను సోమవారం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సాహు, డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము ఉన్నారు.

కుంకుమార్చన పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: కుంచాలకూర్మయ్యపేట దేవీ ఆశ్రమంలోని శ్రీచక్రాలకు హైదరాబాద్ నుంచి వచ్చిన బదిరులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కర శర్మ ప్రత్యేక పూజలు చేయించారు. ఖడ్గమాల పారాయణతోమేరువులకు, శ్రీచక్రాలకు పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

సుధాకర్‌కు మద్దతు ఇవ్వాలి

● ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



వెంకటేశ్వర కళాశాలలో పట్టభద్రులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అండగా నిలిచి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర, చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది, పట్టభద్రులకు ప్రచార కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. శాసన సభలో మెజారిటీ ఉన్న వైఎస్సార్‌సీపీకి శాసన మండలిలో సైతం మెజారిటీ అవసరంగా చెప్పారు. రాష్ట్ర ప్రగతికి విద్యావంతులు మద్దతు ఇవ్వాలని, పట్టభద్రులు, మేధావులు ఆలోసించి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జరుగుళ్ల శంకరరావు, సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, మూగి శ్రీరాములు, బెండు రామారావు, బోర సాయి రాంరెడ్డి పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



లావేరు: ఇజ్జాడపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

లావేరు: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ మండల మాజీ కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. ఇజ్జాడపాలెం గ్రామంలో సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివాంగం నాగరాజు, వార్డు మెంబరు ఇప్పిలి క్రిష్ణ, నాయకులు యందవ శ్రీనివాసరావు, పతివాడ గంగునాయుడు, మీసాల నారాయణరావు, జగ్గురోతు రాము, దన్నాన రాంబాబు, పతివాడ రాము, పిల్ల సీతయ్య, పిల్ల పుణ్యవతి, బాలి అప్పలనాయుడు, పిల్లా దుర్గాప్రసాద్, ఇజ్జాడ అప్పలనాయుడు, ధర్మారావు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ శ్రీకూర్మనాథునికి పూజలు

గార: పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శ్రీకూర్మనాథునికి శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు పూజలు జరిపించారు. కార్యక్రమంలో డబ్బీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేయాలి



రణస్థలం: జె.ఆర్.పురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు అన్నారు. జె.ఆర్.పురం పంచాయతీలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచార పత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన సుధాకర్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, ఇడదాసుల తిరుపతిరాజు, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజీ, పిన్నింటి సత్యంనాయుడు, మింద్రాన రామారావు, బవిరి ప్రదీప్, గోవిందాసు సాయి, గాజుల భాస్కరరావు ఉన్నారు.

ఒత్తిడి లేకుండా చదవాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పరీక్షలకు ముందు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా చదువుకోవాలని విశ్రాంత ఉపాన్యాసకులు ఎస్.నరసింహమూర్తి అన్నారు. కోరి సమస్యలను కొనితెచ్చుకోవద్దని విద్యార్థులకు సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మొదలవలస క్రిష్ణవేణి అధ్యక్షతన పరీక్షలకు సన్నద్ధతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నరసింహమూర్తితోపాటు వైద్యులు ఎం.మోహనరావు, రచయిత జంధ్యాల శరత్‌బాబు తదితరులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరీక్షలకు ముందు ప్రణాళికబద్ధంగా చదవాలని, రివిజన్ ముఖ్యమని, వెనుకబడిన సబ్జెక్టులపై ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు.

విద్యార్థులకు శారీరక ఆరోగ్యం, నిద్ర ముఖ్యమన్నారు. జంక్‌ఫుడ్‌లకు, సామాజిక మాధ్యమాలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం.క్రిష్ణవేణి మాట్లడుతూ.. పాజిటివ్ మైండ్‌సెట్‌తో పరీక్షలకు హాజరై విజయం సాధించి కళాశాలకు గుర్తింపు, గౌరవాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ఒక్క అవకాశం ఇవ్వాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవీంద్రబాబు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుప్పల రవీంద్రబాబు ఓటర్లను కలిసి తనకు ఓటు వేసి ఒకఅవకాశం ఇవ్వాలని కోరారు. పీఎన్‌కాలనీ, వెంకటాపురం, కిమ్స్ హాస్పటల్ పరిసర ప్రాంతాల్లో సోమవారం పర్యటించి పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బ్యాలెట్ నమూనా కరపత్రాలను పంపిణీ చేశారు.

జన్ ఔషధీ కేంద్రాలను ప్రజలకు చేరువ చేయాలి



జగన్‌మోహన్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రధానమంత్రి జాతీయ జన్ ఔషధీ కేంద్రాలను ప్రజల్లోకి విద్యార్థులు తీసుకెళ్లాలని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు అన్నారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం, ప్రధానమంత్రి భారతీయ జన్ ఔషధీ పరియోజన ఐదువ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జనరిక్ మందుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ధరకి నాణ్యమైన మందులు అందించటం ఈ పథకం లక్ష్యంగా చెప్పారు. జనరిక్ మందులను వాడడం వల్ల సైడ్ ఎఫెక్టులు ఉండవన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు జగన్‌మోహన్‌రావుకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు కె.దుర్గాప్రసాద్‌రావు, దుర్గా శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

12న ఉచిత కంటి వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: హయాతినగరంలోని కిల్లాన వారివీధిలో ఈనెల 12వ తేదీన వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో కిల్లాన చారిటబుల్ ట్రస్టు, సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో జరిగే శిబిరంలో అన్ని రకాల కంటి వ్యాధులకు తనిఖీలు నిర్వహిస్తారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

లావేరులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లావేరు: ఈనెల 13వ తేదీన జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం లావేరు ప్రభుత్వ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి చెప్పారు. ఎస్సై కోటేశ్వరరావుతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరిగే ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలో 1206 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 899, మహిళలు 307 మంది ఉన్నారన్నారు. హైస్కూల్ హెచ్ఎం పట్నాన రాజారావు, వీఆర్వోలు టి.లక్ష్మణరావు, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

ఎన్‌ఈఆర్ స్కూల్లో ఇంటర్మీడియెట్ తరగతులకు అనుమతి

రణస్థలం: ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 2023 అకాడమిక్ ప్రారంభం నుంచి ఇంటర్మీడియట్ (సీనియర్ సెకండరీ) తరగతులకు అనుమతి లభించిందని స్కూల్ చైర్మన్ ఎన్.ఈశ్వరరావు తెలిపారు. నడుకుదిటిపాలెంలో స్కూల్ వద్ద సోమవారం మాట్లాడుతూ.. సీబీఎస్‌ఈ సిలబస్ 11,12 తరగతుల నిర్వహణకు అనుమతి వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎస్.తేజ, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



లావేరు: పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది



శ్రీకాకుళం రూరల్: పశువులకు టీకా వేయిస్తున్న దృశ్యం



జి.సిగడాం: పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: వెంకటాపురం గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సోమవారం వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకటాపురం పశువైద్య ఉప కేంద్రం వెటర్నరీ జూనియర్ అధికారి రవికుమార్, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం పశు సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాడి రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 31వతేదీ వరకూ ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామృష్ణ, వార్డు సభ్యుడు పిట్ట అప్పన్న పాల్గొన్నారు.

సంతవురిటిలో..

జి.సిగడాం: సంతవురిటి ఆర్‌బీకే పరిధిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ బుడారి లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూగ జీవుల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారిణి మాధవికల్పన మాట్లాడూతూ.. జీవాలకు వ్యాధులు సోకితే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శి హిమబిందు, వైద్య సిబ్బంది అప్పన్నదొర, అగ్రికల్చర్ అసిస్టెంట్ అలుగోలు లక్ష్మీనారాయణ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: అరసవల్లి పశువైద్యశాలలో కళ్లేపల్లి, కిల్లిపాలెం, బావాజీపేట, వప్పంగి గ్రామాల పాడి రైతులకు చెందిన పశువులకు గాలికుంటి వ్యాధి నివారణ టీకాలను డాక్టర్ దిలీప్ ఆధ్వర్యంలో వేశారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని వైద్యులు సూచించారు.

సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని సోమరాజపురం, గురండి, బమ్మిడి గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరు కావడంపై ఎంపీడీఓ పావనికి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామ సచివాలయాలను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిమిత్తం సందర్శించామన్నారు. సోమరాజపురంలో కేవలం ఇద్దరు, గరుండిలో ఒకరు, బమ్మిడిలో ముగ్గురు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. వీఆర్వో, సర్వేయర్‌లు రీ సర్వేలో ఉన్నట్లు విధుల్లో ఉన్న ఉద్యోగులు తెలిపారన్నారు. మిగిలిన ఉద్యోగులు కొందరు సెలవు పెట్టారన్నారన్నారు. కొంతమంది ఉద్యోగులు ముఖ హాజరు వేసుకుని ఇతర పనులపై బయటకు వెళ్లారన్నారు. సాయంత్రం మూడు గంటలకు స్పందన నిర్వహించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. నిర్వహించడం లేదన్నారు. బమ్మిడిలో పూర్తిగా పంచాయతీ కార్యదర్శి హాజరు కాలేదన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నివేదికలు సిద్ధం చేయాలి

పొందూరు: స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధించి తీసుకున్న చర్యల నివేదిక (ఏటీఆర్)లు మండల స్థాయి అధికారులు సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్ ఎస్.రాంబాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులకు వినతులు అందాయి. ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళి, ఎంఈఓ పి.వి.రామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉమారుద్రకోటేశ్వర స్వామికి కామదహనోత్సవం



కామదహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణంలోని గుడివీధిలో ఉన్న ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం కామదహనోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. గుడి వీధి కూడలిలో మంట ఏర్పాటు చేసి మూడుసార్లు స్వామి పల్లకినీ తిప్పి కామదహనోత్సవ వేడుకలు చేశారు. అనంతరం పూజలు చేయగా భక్తులు దర్శించుకున్నారు.

పున్నమి సందర్భంగా మంగళవారం డోలో మండపంలో డోలోత్సవం రాధాకృష్ణులకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులంతా డోలో మండపానికి ఉదయం ఎనిమిది గంటలకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉరిటి శ్రీనివాస్, బాలామణి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న నాయకులు

రణస్థలం: ఎర్రవరం పంచాయతీ చినయామలపేట గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆరో వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్తులు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నాయకులు మహంతి పెద రామినాయుడు, బొమ్మలాట శ్రీరాములు, గొర్లె రామునాయుడు, మింది శ్రీనివాసరెడ్డి, యామల క్రిష్ణ ఉన్నారు.

గొబ్బూరులో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



బూరెలు వేస్తున్న వేదపండితులు

జి.సిగడాం: గొబ్బూరు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఇందులో భాగంగా ఆలయం శిఖరం పైనుంచి వేదపండితులు బూరెలను విసరగా.. వీటిని మహిళలు చీరకొంగుచాసి పట్టుకున్నారు. బూరెలను పట్టుకుంటే మేలు జరుగుతోందనే నమ్మకంతో మహిళలు వీటి కోసం పోటీపడ్డారు.



బూరెల కోసం కొంగు పడుతున్న మహిళలు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



గొలివివానిపేటలో పొలంబడి నిర్వహిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని ప్రాజెక్టు ట్రైనర్ లక్ష్మునాయుడు అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సాగుచేస్తున్న కూరగాయలు, ఉద్యానవన పంటలు, వరికి వ్యాపించే తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తెగుళ్లను కషాయాల ద్వారా ప్రాథమిక దశలోనే నియంత్రించ వచ్చునన్నారు. పంటలకు సంబంధించి సాగు ప్రారంభం నుంచి పంట చేతికి వచ్చేవరకు వ్యవసాయ క్యాలెండర్ మేరకు పంటపై అవగాహన అవసరంగా చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు పూర్తిస్థాయిలో వినియోగించకుండా పశువుల ఎరువులు, ద్రవ, ఘన జీవామృతం, కషాయాలు వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ప్రాణం విలువ తెలుసుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ప్రాణం విలువ తెలుసుకోవాలని ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలురు)లో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు దాటని వారు వాహనాలు నడపవద్దన్నారు. తల్లిదండ్రులు సైతం మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగంగా వాహనాలు నడపటం, మద్యం సేవించి నడపటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవటం, డెల్మెట్ పెట్టుకోకపోవడమే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

● శ్రీకూర్మంలో డోలోత్సవ సందడి

శ్రీకూర్మంలో సోమవారం సాయంత్రం నుంచి డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు భారీగా తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. స్వామి తిరువీధి, కామదహనోత్సవం కన్నుల పండువగా జరగ్గా..ఈ సుందర దృశ్యాలను చూసి భక్తులు పరవశించిపోయారు. -గార



